
కథ

# మదర్స్‌డే

ఇంద్రగంటి జానకీబాల



తెల్లారకుండానే ఫోను మోగుతుంటే, కళ్లు తెరవకుండానే దిండు పక్కనే వున్న సెల్ అందుకుంది శకుంతల. చెవి దగ్గర పెట్టుకుని ఎవరై వుంటారా అనుకుంటూ 'హలో' అంది. ''శకూ- నీకో శుభవార్త చెప్దామని సుప్రభాతం పాడుతున్నా'' అంది అవతలి వైపు నుంచి వనజ.

''శుభవార్తా- ఏమిటి? చెప్పు చెప్పు'' అంటూ తొందర చేసింది.

'నువ్వు పదిగంటలకంతా మా స్టూడియోకొచ్చేయ్. నిన్ను యాంకర్‌గా సెలక్ట్ చేసే ప్రయత్నంలో రాత్రి పన్నెండు అయింది. అప్పుడే చేద్దామనుకున్నా. కానీ... ఎందుకులే అని ఇప్పుడు చేస్తున్నా' అంది ఒక్క గుక్కలో.

''నిజమా'' బద్ధకం వదిలి గట్టిగానే అరిచింది శకుంతల.

''లేకపోతే ఈ రోజు ఏప్రిల్ ఫస్టు కూడా కాదు'' నవ్వింది వనజ.

''నేను నమ్మలేకుండా వున్నాను'' అంది.

మరిక నమ్మి, లేచి త్వరగా తయారై వచ్చేయ మంచి కలర్‌ఫుల్ డ్రస్ వుంటే వేసుకురా- కాస్ట్యూమ్స్ ఇక్కడ కూడా వున్నాయిలే. చూద్దాం-మేకప్ సరేస రి-సరేనా-బై'' అంటూ ఫోన్ పెట్టేసింది. శకుంతలకి ఒక్కసారి మెలకువ వచ్చినట్లుగా అనిపించింది. వనజ చెప్పిన విషయం పూర్తిగా అర్థమయ్యేసరికి ఒక టే టెన్షన్.

ఎటూ తోచక ఒక్క క్షణం అలాగే వుండిపోయింది. ఆనందంగా వున్నా ఏదో అసంతృప్తి లోపల్లోపల వుంది. ఎన్నాళ్లుగానో తను కలలు గంటున్న కోరిక ఇంత సడెన్‌గా ఎదురైంది. ఇప్పుడు తనీ అవకాశం బాగా ఉపయోగించుకుని, తనని తను నిరూపించుకో వాలి.

మంచం మీంచి ఒక్కసారిగా కిందకి దూకింది. పక్క మంచం మీద ఇంకా నిద్రపోతున్న లావణ్య ముఖం మీంచి దుప్పటి తొలగించి చూసి, అబ్బా! నీ కప్పుడే తెల్లారిందా తల్లీ అని మళ్లీ కప్పేసుకుంది.

ఎనిమిదిన్నరకే జోళ్లల్లో కాళ్లు పెట్టి 'మరి నే వెళ్తున్నా' అంది.

''ఆల్ ది బెస్ట్-బై'' అంది లావణ్య చెయ్యూపుతూ..

రెండు బస్సులు మారి ఆ టీవి ఆఫీసుకి చేరేసరికి ఇంకా పావు తక్కువ పదే అయింది.

హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని, లోపలకి అడుగుపెట్టింది. ఎప్పుడో ఒకసారి వనజతో వచ్చిందిక్క డికి.

అక్కడే వున్న ఒక కుర్రాడు వచ్చి శకుంతలగారా- వనజగారొస్తారు కూర్చోండి అంటూ లోపలకి తీసుకెళ్లి కూర్చోబెట్టాడు. ఆ రూం మధ్యలో పెద్ద ఆఫీసు టేబుల్, దాని చుట్టూ పది ఛైర్లు నీట్‌గా, నిగనిగలాడుతూ వున్నాయి. దాని మీద అప్పటికే అమర్చిన మంచినీళ్ల గ్లాసులు.

శకుంతల ఒక గ్లాసు నీళ్లందుకుని కుర్చీలో కూర్చుని తాగేసింది. ప్రాణం హాయిగా అని పించింది. ఆందోళన తగ్గి కుదుటపడినట్లుగా వుంది. తనేం చెయ్యాలో- ఎలా చెయ్యాలో ఏమీ తెలీదు. వనజ వస్తే గానీ అంతా సస్పెన్స్-అయినా ఏదైనా అప్పటికప్పుడు అందంగా, బాగా చెయ్యాలి. అదీ ఛాలెంజ్.

తుఫానులా దూసుకొచ్చిన వనజ ''హాయ్ శకూ-యూ ఆర్ వెరీ లకీ'' అంటూ భుజాలు పట్టుకొని ఊపేసింది.

''నిజమే- థ్యాంక్యూ వెరీ మచ్'' అంది నెమ్మదిగా.

''ఇట్స్ ఓ.కే.- నువ్వు ఫస్టు యాంకరింగ్ చేస్తున్న ప్రోగ్రామ్ ఎంత గొప్పదో తెలుసా?'' అంది.

శకుంతల తెల్ల మొహం వేసి ''నాకేం తెలుసు'' అంది.

రేపు మదర్స్ డే- ఆ సందర్భంగా ఒక ప్రోగ్రామ్. ఇద్దరు పేరున్న రచయిత్రులు, ఒక డాక్టరు, ఒక సైకియాట్రిస్టు. మధ్యలో ఒక తల్లీ కూతురూ చేసే వంట. మొత్తం ప్రోగ్రామ్ నువ్వే.

మదర్స్ డే అనగానే శకుంతల ముఖం చిరాకుగా చిటపటలాడింది. కానీ, ఆమె ముఖంలో భావాలు వనజ చూసినట్లు లేదు. అందుకే వెంటనే డ్రాయరు సొరుగులోంచి నాలుగు పేజీల స్క్రిప్టు తీసి-

అమ్మంత గొప్పది ఈ ప్రపంచంలో లేదు. అమ్మ మాటలలోని అమృతం మరెక్కడా దొరకదు. అమృత నంలోని కమ్మదనం అరుదైన వరం. అమ్మ తినిపించే గోరుముద్దలు ఆప్యాయతను అందించే వెన్న ముద్దలు...

ఇలా చదువుకెళ్లిపోతుంటే శకుంతల వంటికి కారం రాసినట్లుగా అనిపిస్తూ వుంది. కానీ ఈ స్క్రిప్టు రకరకాల హావభావాలతో ముద్దుగా, ముచ్చటగా, మురిపెంగా, గారంగా, గాఢంగా చదివి ప్రేక్షకుల్ని అలరించాలనే వూహ ఆమెని కృంగదీసింది.

సంప్రదాయ సిద్ధంగా వున్న డ్రస్ వేసి అత్యంత ఆధునికంగా మేకప్ చేసి, మోచేతుల వరకూ గాజులు-మెడలో బరువైన పతకం చేతులు రెండూ కలుపుతూ విడదీస్తూ, విచిత్రంగా మెడని ఊపుతూ, తల కాయ పరికించి, ఒళ్లంతా పులకింతగా జలదరింప జేస్తూ శకుంతల అరనిముషంలో కంఠతా పట్టిన వాక్యాలను అలవోకగా చెప్పింది.

ప్రోగ్రామర్ రెండు మూడు సార్లు ఆమె దగ్గర కొచ్చి, భాష బాగుంది. ఎక్స్‌ప్రెషన్ కూడా బాగానే వుంది. కానీ ఫీలింగ్ ఇంకా గాఢంగా వుండాలి అని చెప్పాడు. ఆమె చేతనైనంత నటన చేసింది.

రెండుగంటల రికార్డింగ్ తర్వాత ఓకే అయింది. డాక్టర్లు, రచయిత్రులు, వంటలక్కలు అందరూ ఆనందంగా అమృతనాన్ని అందరికీ పంచి తర లించారు.

చివరగా...అంతా బాగానే వుంది కానీ ఫీలింగ్ పలికించడంలో ఇంకా శ్రద్ధ వహించాలి'' అన్నాడా యన.

'ఫస్ట్‌టైం' కదా అంది వనజ.

''ఎస్... ఎస్...'' అంటూ తల ఊపి వెళ్లిపోయాడు.

వనజ షేక్ హ్యాండ్ ఇచ్చి ఎల్లుండి కలుద్దాం. రేపు మా అమ్మ దగ్గరకెళ్లాలి. నువ్వు ప్రోగ్రాం మిస్సవకు. నాకు చెప్పాలి-బై...'' అంది.

శకుంతల బయటకొచ్చింది. కడుపులో మంటగా వుంది. గుండెల్లో గుబులుగా, మనసంతా కలతగా వుంది. దుఃఖంగా వుంది. నెల్లాళ్ల క్రితం తన ఆలోచనా, తన ఊహలు ఆశలు వేరుగా వుండేవి. ఒక్కసారిగా రంగు రంగుల పూలవనం ఉప్పెనలో ఊడ్చిపెట్టుకుపోయినట్లుగా అయిపోయింది.

ఆ రోజు శకుంతల ఇంట్లోంచి బయటకి అడుగు పెడుతుంటే 'తులసీ' అంటూ మహాలక్ష్మి ఆంటీ లోపలకొచ్చింది. వస్తూనే శకుంతల వైపు పరీక్షగా చూసి, పరవశంగా కళ్లు చిన్నవి చేసి ...

''నీ ముందు ఏ సినిమా స్టారైనా దిగతుడుపే'' అంటూ చూపుడు వేలు, బొటన వేలు కలిపి సూపర్ అనే భంగిమ చూపించింది.

ఆమె సిగ్గుపడి 'థ్యాంక్యూ ఆంటీ' అని ఒక అడుగు బయటకేసింది. ఇంతలో తులసి లోపలి గది లోంచి హాల్లోకి తొంగి చూసి 'రావే లక్ష్మీ' అంది.

బయటకెళ్లిన శకుంతల హాల్లోనే షోకేసులో పెట్టిన ఎడ్రస్ కాగితం తీసుకుందుకు మళ్లీ వచ్చింది. అప్పుడే ఆమె చెవుల్లో విచిత్రమైన మాటలు పడ్డాయి.

రోడ్డు మీద దొరికితే దొరికింది కానీ అందాల చందమామలాంటి పిల్ల దొరికిందే నీకు అంది మహాలక్ష్మి.

ఆ మాటలు అత్యంత స్వచ్ఛంగా, స్పష్టంగా విని పించడంతో అచేతనంగా అక్కడలా నిలబడిపో యింది శకుంతల.

''అబ్బో! కాస్త చను వున్న వాళ్లంతా అంటారు. ఆ పిల్ల అస్సలు మీ అమ్మాయి లాగే వుండదు. మీ పోలిక ఎక్కడాలేదు'' అంటూ మురిపెంగా చెప్పింది తులసి.

శకుంతల గుండెల్లో పెద్ద రాయిపడినట్లు బరువుగా అనిపించింది.

''నీ మొహం నిజానికి హేమమాలిని క్కూడా ఇంత అందమైన కూతురు లేదు. ఏ తల్లి కన్నబిడ్డో తెలీదు కానీ- ఏ మహరాజయో కనిపడేసిందనిపిస్తుంది'' అంది మహాలక్ష్మి.

శకుంతలకి పూర్తిగా విషయం అర్థమైపో యింది. సుమారు ఐదారేళ్ల క్రితం వివేకం మామయ్య వచ్చినప్పుడు మాటల్లో ఏదో అందీ అందని అను మానం వచ్చింది. కానీ వెంటనే అది పక్కకెళ్లిపో యింది.

షోకేసులో బొమ్మ కింద పెట్టిన కాగితం తీసుకుంది. కానీ కన్నీళ్లు ఆగడం లేదు. అసలు తనెవరు? నాకు అమ్మ తులసి కాకపోతే తనని కన్న అసలు అమ్మెవరు? అదేగా వాళ్లు మాట్లాడుకుంటున్నారు. తనని కన్న తల్లి రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోతే ఈమె తెచ్చిపెంచి తననింత దాన్ని చేసిందన్నమాట.



ఆ రోజు శకుంతల ఇంట్లోంచి బయటకి అడుగు పెడుతుంటే 'తులసీ' అంటూ మహాలక్ష్మి ఆంటీ లోపలకొచ్చింది. వస్తూనే శకుంతల వైపు పరీక్షగా చూసి, పరవశంగా కళ్లు చిన్నవి చేసి ... ''నీ ముందు ఏ సినిమా స్టారైనా దిగతుడుపే'' అంటూ చూపుడు వేలు, బొటన వేలు కలిపి సూపర్ అనే భంగిమ చూపించింది. ఆమె సిగ్గుపడి 'థ్యాంక్యూ ఆంటీ' అని ఒక అడుగు బయటకేసింది.

ఆ క్షణంలో ఈ పెంచిన తల్లి మీద ప్రేమ పొంగి పొర్లిపోవడానికి బదులు, కని, వదిలేసిన కన్నతల్లి మీద కసి, కోపం ఉప్పెనలాగా పెరిగాయి.

హాల్లో చప్పుడైతే వచ్చిన తులసి అక్కడ శకుంతలని చూసి కంగారు పడిపోయింది. దానికి తోడు కళ్ల నిండా నీళ్లతో వివర్ణమైన కూతురి ముఖం చూస్తే ఆమె మనసు తల్లడిల్లిపోయింది. నోట మాట రాలేదు. శకుంతల అక్కడే సోఫాలో కూలబడి వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. బయటకొచ్చిన మహాలక్ష్మి సంగతి గ్రహించింది. తన వల్ల తప్పు జరిగిందని తెలిసి, దాన్ని సరిదిద్దుకోవాలని తాపత్రయపడడం మొదలుపెట్టింది.

శకూ! అమ్మలూ ఏమిటే అంటూ బుజ్జగించబోతే బోరుమంది ఆమె-

ఇద్దరూ ఏం చెయ్యాలో తోచక తికమకపడ్డారు... చక్కగా, అందంగా తయారై బయటకెళ్లబోతున్న



**“ఈ మాతృత్వం, తల్లిప్రేమ, అమ్మతనం అనే భావజాలం వట్టి బూటకమని నా నమ్మకం. బిడ్డని కన్నతల్లి ఆ బిడ్డ కోసం ప్రాణాలు వదిలేస్తుందనీ, తన సుఖం, తన మానం, తన కోరిక, తన ఆశలు అన్నీ బిడ్డ కోసం వదిలేసుకుంటుందనీ చెప్పడానికి, వినడానికీ బాగానే వున్నా, అది నిజం కాదనిపిస్తుంది.”**

శకుంతల పది నిమిషాల్లో పాలిపోయిన ముఖంతో, చెదిరిన జుత్తుతో, కాటుక మరకల చెంపలతో వికారంగా తయారైపోయింది. మహాలక్ష్మి, తులసి అయోమయంలో అక్కడే వుండిపోయారు. ఇద్దరూ శకుంతలని బుజ్జగించి, లాలించి నెమ్మదిగా అసలు సంగతి చెప్పక తప్పలేదు.

“ఏదో ఒక రోజున నీకు ఈ విషయం చెప్దామనే అనుకున్నాను. ఏదో అలా గడిచిపోతూ వచ్చింది. ఇలా హటాత్తుగా నువ్వు వినడం, విలవిల్లాడిపోవడం నాకెంతో బాధగా వుంది. అయినా ఇందులోనే చేసిన తప్పేం లేదు. నాకు పిల్లలు లేరు. అప్పుడు మేం బళ్లారిలో వుండేవాళ్లం. తెలతెలవారుతుండగా, వాకిలి తుడిచి ముగ్గు వేద్దామని తలుపు తీసిన నాకు పొత్తిళ్లలో నువ్వు కనిపించావు. ఆశ్చర్యంతో చూసి ఎత్తుకుని చుట్టూ చూసాను ఎవ్వరూ కనిపించలేదు. మీ నాన్నని, అదే మా ఆయన్ని లేపి చెప్పాను. చుట్టుపక్కల వాళ్లు లేచి హడావుడి చేశారు. పోలీసు స్టేషన్‌లో అప్పగించమన్నారు. మేమిద్దరం మాట్లాడుకుని మా దగ్గరే వుంచేసుకున్నాము. ఆ రోజే డాక్టరు దగ్గరికి తీసికెళ్లి చూపించి మందులు అవీ తీసుకున్నాం. అప్పటికి నీకు పది, పన్నెండు రోజులు వయస్సుండచ్చు.”

“మీ నాన్న నిన్ను ప్రాణం కంటే ఎక్కువగా చూశారు. మేం ఇద్దరమే వున్నప్పుడు నీ గురించే చెప్పేవారు. పోయేటప్పుడు కూడా నీ మాట చెప్పే ప్రాణం వదిలారు” తులసి కళ్ల నీళ్లు పెట్టుకుంది.

ఒక వారం రోజులు శకుంతల మామూలు మనిషి కాలేకపోయింది. మరో లోకంలోకి అడుగుపెట్టినట్లు, మరో జన్మ ఎత్తినట్లు ఆమెకి తరచూ అనిపించేది. అనుక్షణం తను అనాథ, పుట్టిన వెంటనే తల్లి తనని వదిలేసింది. అనే ఆలోచనే వదలకుండా బాధించడం మొదలుపెట్టింది. తల్లి కంటే ప్రేమగా పెంచిన తులసితో తన బాధని పంచుకోలేక మథనపడిపోయేది.

***

“ఈ మాతృత్వం, తల్లిప్రేమ, అమ్మతనం అనే భావజాలం వట్టి బూటకం అని నా నమ్మకం. బిడ్డని కన్నతల్లి ఆ బిడ్డ కోసం ప్రాణాలు వదిలేస్తుందనీ, తన సుఖం, తన మానం, తన కోరిక, తన ఆశలు అన్నీ బిడ్డ కోసం వదిలేసుకుంటుందనీ చెప్పడానికి, వినడానికీ బాగానే వున్నా, అది నిజం కాదనిపిస్తుంది. బిడ్డని కని, ఒక క్షణం కూడా వదలకుండా అంటిపెట్టుకుని ఆ పసిబిడ్డను సాకడం వల్ల ఒక అనుబంధం- ఒక అటాచ్‌మెంట్ వుండి పిల్లల కోసం తల్లి పాటుపడుతుంది. అవి కూడా తన పరిధిలోనే...తన పరువు, తన సుఖం, తన వ్యక్తిత్వం, తన ఆశలు ఇవన్నీ పోగొట్టుకుని కాదు. అవి వున్నప్పుడే. అదే నిజం కాకపోతే ఇంతమంది పిల్లల్ని కని అక్కడా అక్కడా ఎందుకొదిలేస్తున్నారు? పరిస్థితుల ప్రభావం అంటారు. అదే పరిస్థితులు అనుకూలంగా వున్నప్పుడే అన్ని ప్రేమలూ తనాలు వుంటాయి. పుట్టిన క్షణం నుంచీ ఒక తండ్రి ఆ బిడ్డని అంటిపెట్టుకుని ఉచ్చలు తీసి, దొడ్డి గుడ్డలు మార్చి, ముడ్డి కడిగి, పాలు పట్టి, ఏడిస్తే ఊరడించి, జోకొట్టి, భయపడితే గుండెల మీద చేర్చుకుని ధైర్యం కలిగించి, అన్నీ చేస్తే ఆ తండ్రికీ బిడ్డ మీద అమ్మతనం, మాతృత్వం మరేదో..మరేదో అన్ని కలుగుతాయి. కనడం అనేది ఒక మెకానికల్ ప్రక్రియ. దాన్ని ఆకాశానికి ఎత్తనవసరం లేదు. నిర్లక్ష్యం చేయనవసరం లేదు. ఒక స్త్రీ కడుపులోంచి బయటకొచ్చినంత మాత్రాన ఆ తల్లికి ఆ పిల్ల మీద ఎనలేని ప్రేమ వుండాలని రూలేం లేదు. ప్రేమ ఒక అలవాటు. ఒక అనుబంధం. ఒక అటాచ్‌మెంట్ అంతే.” ఆమె మాటలు నోరు తెరిచి వింటూ వుండిపోయింది శకుంతల.

“మీరు చెప్పేది నాకు నమ్మశక్యం కావడం లేదు. ఇన్నాళ్లు వింటూ నమ్ముతూ వచ్చింది ఒక్కసారి అబద్ధం అంటే...” ఆగింది.

“ఒక్కసారిగా నమ్మకు, నెమ్మదిగా ఆలోచించి, అర్థం చేసుకోడానికి ప్రయత్నించు.”

“నాకంతా అయోమయంగా వుంది” శకుంతల అస్థిమితంగా తలవూపింది.

“కేవలం కన్నందుకే ప్రేమ వుంటుందంటే ఎప్పుడో పద్దెనిమిదేళ్ల క్రితం నిన్ను కని వదిలేసిన నీ తల్లికి, నిన్ను పెంచిన తులసి కంటే నీ మీద ఎక్కువ ప్రేమ వుండాలి కదూ...”

“అబ్బే! మా అమ్మకి, అంటే నన్ను పెంచిన తల్లికి నేనంటే పంచప్రాణాలు. ఈ ఇరవై రోజులుగా ఆమె చిక్కి సగమై పోయింది.”

“అందుకే నువ్వు పిచ్చిపిచ్చి ఆలోచనలు మాను. ఈ జీవితంలో మనకి లభించేదే ప్రేమ. ఎక్కడో ఏదో పోగొట్టుకున్నామని అశాంతి పాలవడం అజ్ఞానం” అంటూ ఆమె శకుంతల వైపు చూసి స్నేహంగా నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు స్ఫురించాయి.

‘స్త్రీ హృదయం’ సంస్థ కోసం పనిచేస్తున్న గార్గి మాటలు శకుంతల మీద ఎంతగానో పనిచేశాయి. ఇరవై రోజులుగా తను అమ్మ మీద అలిగి లావణ్య రూంలో వుండిపోయింది. ఎన్నిసార్లు అమ్మ వచ్చి బతిమాలినా వెళ్లలేదు. కారణం తెలీదు. అసలు సంగతి తెలిసి లావణ్య తనని ఇక్కడికి తీసుకొచ్చింది. మబ్బు విడిపోయినట్లుగా వుంది. వెంటనే గుండెల్లోని బాధను ఎవరో తొలగించినట్లనిపిచింది.

“ఆడవాళ్లు మాత్రమే పిల్లల్ని పెంచగలరు. మగవాళ్ల వల్లకాదు అని అందరూ అంటూంటారెందుకని?” అంది శకుంతల.

“పిల్లల్ని పెంచడం అంటే ఇరవై నాలుగు గంటలూ అదే పనిలో వుండాలి. విసుగూ, విరామం వుండకూడదు. చనుబాలు తల్లి దగ్గరే కదా తాగేది. అందుకని మొత్తం పని స్త్రీలకే అప్పగించారు. ఉత్తినే ఇస్తే వాళ్లు ఎదురుతిరిగే అవకాశం వుంది. ‘నువ్వో బిడ్డపని చెయ్యి’ అనొచ్చు. అందువల్ల స్త్రీత్వం, మాతృత్వం, అమ్మతనం, మాతృప్రేమ లాంటి మాటలతో వాళ్లని గారడీ చేసి పనిచేయిస్తూ వస్తారన్న మాట. లేకపోతే ఉచ్చగుడ్డలు ఉతకడం, స్నానాలు చేయించడం, రోగాలు రొస్టులూ వస్తే చూసుకోవడం పురుషుల మీద కూడా పడతాయి. అందువల్ల పిల్లల్ని పెంచే బాధ్యత తల్లులదేనని, ఆ పని వారే చెయ్యగలరని నిర్ణయించి వదిలేశారు. పిల్లలని కని ఒకవేళ భార్య చనిపోతే, మరొక భార్యని వెంటనే కట్టుకుని ‘పిల్లాడ్ని పెంచాలి కదా’ అని న్యాయం పలుకుతారు.

బాగా ఆలోచిస్తే ఆడపనీ, మగపనీ అంటూ ఏమీ లేవు. ప్రయత్నిస్తే అన్ని పనులూ అందరూ చెయ్యగలరు. ఏం? ఒకప్పుడు ఉద్యోగం పురుష లక్షణం అన్నారు. ఇప్పుడది మారి పోలేదూ..

ఇంతకీ అసలు సంగతికొస్తే మనిషి ఆడైనా, మగైనా తనీ ప్రపంచంలో బతకడానికి అడ్డువచ్చిన వాటిని తొలగించుకుంటూ పోవడం సహజం. ఇక్కడ అమ్మకో న్యాయం, నాన్నకో న్యాయం లేదు.

జరిగిపోయిన పాత కథని గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోకు. ఎవరు ఏ పని చేసినా వెనుక వున్న బలమైన కారణాల్ని అర్థం చేసుకుంటూ పోవడమే మనం చెయ్యాల్సిన పని” పెద్ద లెక్చరిచ్చి ఊపిరి పీల్చుకొంది గార్గి.

పిల్లలకి కూడా తల్లిదండ్రులతో కలిసి పెరిగితేనే వాళ్లమీద ప్రేమ, అనుబంధం వుంటాయి. దూరంగా పెరిగిన పిల్లలకి తల్లిదండ్రుల మీద అనురాగం వుండదని ఇప్పుడు అందరూ గోల పెడుతున్నారు. పిల్లలు పేరెంట్స్ నుండి దూరంగా వుండడం వెస్టరన్ కల్చర్‌గా బాధపడిపోతున్నారు. ఎక్కడో వున్న తల్లిని ఏడాదికోసారైనా చూసి రావాలనే నియమం. అది ప్రేమ, అనుబంధాలకి సంబంధించిన విషయం కాదు. ఇంకా మన దేశ సంస్కృతిలోకి పూర్తిగా వ్యాపించని ఈ అలవాటుని మనం ఎంతో ఉత్సాహంగా చేసుకుంటున్నాం. ఆమె ఆగింది.

శకుంతల ఒక్కసారిగా వులిక్కిపడింది. ఎదురుగా ఆమె ఏవో పేపర్లు చూసుకుంటున్నారు. ఆమె చెప్పాల్సింది చెప్పేసినట్లుగా...

“నేను వెళ్లొస్తానండి. మీ దగ్గరకి రావడం, మీ మాటలు వినడం నాకెంతో బాగుంది. ఇంకా ఎలా చెప్పాలో....”

“ఏం చెప్పొద్దు. హాయిగా హ్యాపీగా వుండు. పెద్ద వయస్సులో మీ అమ్మని బాధించకు. అప్పుడప్పుడు వస్తుండు” అంది గార్గి.

మళ్లీ తలెత్తి “అవునూ- రేపు టీవిలో నీ ప్రోగ్రామ్ వుందిటగా చూస్తాలే” అన్నదామె చిరునవ్వుతో-

“అయ్యో! మీరు చూస్తారా...అదంతా” ఆగింది శకుంతల.

గార్గి పెద్దగా నవ్వి “నువ్వేం చెప్పావని కాదు ఎలా చెప్పావు అని” అంది.

లావణ్యతో కలిసి బయటకొచ్చిన శకుంతల స్వీట్లు, పళ్లు కొనుక్కొని ఆటో ఎక్కి “బై...లావణ్య” అంది. రేపు లేస్తూనే ఒక పూల బొకే అమ్మకోసం తెచ్చి ఇవ్వాలి అనుకుంది శకుంతల.

★